క్లుప్తంగా

ఉద్యోగ భద్రత కల్పించాలి



కరపలో నిరసన తెలుపుతున్న మద్యం షాపుల సూపర్ వైజర్లు, సేల్స్‌మేన్లు

కరప: ప్రభుత్వ మద్యం షాపులలో పని చేస్తున్నవారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సబ్బతి చిట్టిబాబు డిమాండ్ చేశారు. అబ్కారీ మద్యం షాపులలో పని చేస్తున్న సూపర్‌వైజర్స్, సేల్స్‌మెన్లు జిల్లా సంఘం పిలుపుమేరకు శనివారం ఆ సంఘం నాయకులు, ప్రతినిధులు నిరసన తెలిపారు. జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మద్యం పాలసీని మార్పు చేసి కొత్త విధానం అమలు చేయడం వల్ల ఎంతో కాలంగా పని చేస్తున్న సేల్స్‌మెన్, సూపర్‌వైజర్లు రోడ్డున పడతామన్నారు. కొత్త నిబంధనలు తీసుకొచ్చినా తమకు న్యాయం చేయాలని వారు కోరారు. అబ్కారీ మద్యం షాపు సేల్స్ మెన్, సూపర్‌వైజర్లు ఎం.కృష్ణ, పి.చంద్రశేఖర్, కేవీవీ సురేష్, కె.దుర్గాప్రసాద్, కె.లక్ష్మణ్, డి.శివఆంజనేయులు, వి.మణేంద్ర, వై.అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అన్నదానం



నిరుపేదలకు అన్నం వడ్డిస్తున్న సంఘ సభ్యులు

బోట్‌క్లబ్: స్థానిక టూటౌన్ సమీపంలోని హరీష్ స్పోర్ట్స్ వద్ద డొక్కా సీతమ్మ అన్నపూర్ణాదేవి సేవా సంఘం ఆధ్వర్యంలో 350 మందికి అన్నదానం నిర్వహించారు. సంఘం చైర్మన్ తలాటం హరీష్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిరుపేదలు కోసం సంఘం ఆధ్వర్యంలో ప్రతి శనివారం అన్నదానం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కోటయ్య స్వీట్స్ అధినేత రామ్‌కుమార్, వీరబాబు శ్రీను, కోటి, మణికంఠ, సురేష్ , వర్ధిని, సతీష్, సత్తిబాబు పాల్గొన్నారు.

వైభవంగా జపయజ్ఞ పారాయణ



పారాయణలో పాల్గొన్న భక్తులు

బోట్‌క్లబ్: స్థానిక భోగి గణపతి పీఠంలో శనివారం శ్రీవారి 45వ జపయజ్ఞ పారాయణ వైభవంగా జరిగింది. ఉదయం సుప్రభాత వేళలో తిరుమంజన కార్యక్రమం, ప్రబంధ పారాయణ, పుష్పాలంకరణ, తోమాలసేవ నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకులు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ తులసిదళాల పూల మాలలతో ఏడుకొండల స్వామికి ఆళ్వారుల చేపట్టిన అలంకరణ ఆరాధన కలియుగం ఆరంభం నుంచి జరుగుతుందన్నారు. పీఠంలో నిర్వహించే వేంకటేశ్వరస్వామి వ్రత పూజ కల్యాణోత్సవం సందర్భంగా శ్రీవారి సేవా సమాజం ఏర్పాటు చేస్తున్నామన్నారు.

అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌ను సకాలంలో నిర్మించాలి

కరప: మండల కేంద్రమైన కరపలో నిర్మిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాలును సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మండల ఎస్సీ నాయకులు కోరారు. కాకినాడరూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ శనివారం కాకినాడలోని క్యాంపు కార్యాలయంలో మండల ఎస్సీ నాయకులు కలిసి అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు నిర్మాణంలో తలెత్తిన సమస్యలను వివరించారు. ఎమ్మెల్యే నానాజీ స్పందించి అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. సకాలంలో పనులు పూర్తి చేస్తామన్నారు. మండల అంబేడ్కర్ యువజనసేవా సంఘం అధ్యక్షుడు చిన్నం వెంకటేశ్వరరావు, మండల ఎస్సీ నాయకులు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.

డ్వాక్రా రుణాల అవకతవకలపై విచారణ

కొత్తపల్లి: డ్వాక్రా సంఘాల సభ్యులకు ప్రభుత్వం అందించే రుణాలు పక్కదారి పట్టాయంటూ పాత ఇసుకపల్లిలో డ్వాక్రా సంఘాల సభ్యులు జిల్లా కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిపై మండలంలోని పాత ఇసుకపల్లి పంచాయతీ కార్యలయం వద్ద శనివారం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వీవీ పద్మావతి విచారణ చేపట్టారు. వీఓఏగా పని చేస్తున్న పిరాటి పార్వతిని, డ్వాక్రా గ్రూపు సభ్యులను విచారించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీఓఏ పరిధిలో 48 గ్రూపులు ఉండగా ఇప్పటివరకూ 13 గ్రూపుల సభ్యులను విచారించామన్నారు. మిగిలిన గ్రూపులను సోమవారం విచారిస్తామని తెలిపారు.

దోమలపై దండయాత్ర

- దోమల నియంత్రణకు ప్రణాళిక సిద్ధం చేసిన నగర పాలక సంస్థ
- డ్రోన్ స్ప్రే చేసేందుకు ఏర్పాట్లు
- దోమలకు నిలయాలుగా మారిన ఖాళీ స్థలాలు
- 885 స్థలాల గుర్తింపు
- సెప్టెంబర్ నుంచి ప్రారంభానికి చర్యలు



దోమలకు నిలయంగా మారిన ఖాళీ స్థలాలు

కాకినాడ: కంటిపై కునుకు లేకుండా చేస్తున్న దోమలను డ్రోన్ స్ప్రేతో నియంత్రించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులకు కారణమవుతున్న దోమలను అదుపు చేసేలా నగరపాలక సంస్థ ప్రత్యేక దృష్టి సారించింది. ఫ్యాగింగ్ మెషీన్లతోపాటు పెద్దపెద్ద స్థలాల్లో డ్రోన్ యంత్రాలను ఉపయోగించాలని దోమల నివారణ మందు స్ప్రే చేసేందుకు నిర్ణయించింది.

స్థలాలను వదిలేయడంతో..

నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగం ఈ మేరకు ప్రణాళిక సిద్ధం చేసింది. ప్రధానంగా దోమల ఉత్పత్తి కేంద్రాలుగా తయారైన ఖాళీ స్థలాలపై కార్పొరేషన్ దృష్టి పెట్టింది. ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డ ఎంతో మంది ఇక్కడ స్థలాలను కొనుగోలు చేసి దూరప్రాంతాలకు వెళ్లిన నేపథ్యంలో ఆయా స్థలాలను నిరుపయోగంగా వదిలిపెట్టడంతో సమస్య తలెత్తుతోంది. సదరు ఖాళీ స్థలాల్లో వర్షపునీరు, చెత్త, చెదారం పేరుకుపోవడంతో అవి దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. వీటిని అదుపు చేసేందుకు నగరపాలక సంస్థ ఎన్ని చర్యలు తీసుకున్నా ఫలితం కనిపించడంలేదు. ఈ స్థలాల కారణంగా దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులకు ప్రధాన కారణంగా మారుతున్నాయి.

855 ఖాళీ స్థలాల్లో...

దోమల నియంత్రణకు అధికార యంత్రాంగం చర్యల చేపట్టింది. ప్రస్తుతం నగరంలో 14 సర్కిల్స్‌లో చేస్తున్న ఫ్యాగింగ్‌కు తోడు ఖాళీ స్థలాలను లక్ష్యంగా చేసుకుని డ్రోన్స్ స్ప్రేయింగ్ దిశగా కార్పొరేషన్ ఆలోచన చేసింది. ఇందుకోసం నగరమంతా సర్వే చేసింది. దాదాపు 150 ఎకరాల విస్తీర్ణంలో 855 ఖాళీ స్థలాలు ఉన్నట్టు గుర్తించారు. దోమలకు నిలయాలుగా మారుతున్న ఈ ఖాళీ స్థలాల్లో దోమల మందులు స్ప్రే చేయడం కాస్తంత కష్టతరం కావడంతో ప్రత్యామ్నాయంపై దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా ఖాళీ స్థలాల్లో డ్రోన్ స్ప్రేయర్లను వేసి దోమలను అదుపు చేయాలని ప్రయత్నిస్తున్నారు. ఈ మేరకు ఖాళీ స్థలాల్లో డ్రోన్ స్ప్రేయర్లు కోసం కొద్ది రోజుల క్రితం టెండర్ ప్రక్రియ కూడా పూర్తి చేశారు. సెప్టెంబర్ నుంచి డ్రోన్ ప్రక్రియ ద్వారా ఖాళీ స్థలాల్లో స్ప్రేయింగ్ చేయనున్నారు.

స్థల యజమానులకు నోటీసులు

డ్రోన్స్ స్ప్రే ప్రతిపాదించిన నేపథ్యంలో ఇప్పటికే కార్పొరేషన్‌లోని ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇచ్చింది. నిరుపయోగంగా ఉన్న ఖాళీ స్థలాలు డంపింగ్‌యార్డులుగా మారుతున్న పరిస్థితుల్లో స్థలాలకు పెన్సింగ్ వేయడం వంటి చర్యలు చేపట్టాలంటూ నోటీసులు కూడా ఇచ్చారు. దీంతో కొంత మంది స్థల యజమానులు స్థలాలను పరిరక్షించుకునే దిశగా దృష్టిపెట్టారు. ప్రస్తుతం కాకినాడ నగరంలో 14 ఫ్యాగింగ్ మెషీన్లు అందుబాటులో ఉండగా వీటితో నగరంలో 14 సర్కిల్స్‌లోను ఫ్యాగింగ్ కూడా మొదలుపెట్టారు. ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్ పర్యవేక్షణలో చర్యలు చేపట్టారు. ఈ స్థితిలో కార్పొరేషన్ అధికారులు చేపట్టిన ప్రక్షాళన చర్యలు ఎంత మేరకు సత్ఫలితాలను ఇస్తాయో చూడాల్సి ఉంది.



నగరంలో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

దోమల నిర్మూలనకు కార్యాచరణ



డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో భాగంగా ఖాళీ స్థలాల్లో డ్రోన్‌స్ప్రే చేయించేందుకు టెండర్లు కూడా పిలిచాం. త్వరలో డ్రోన్ స్ప్రేయర్ ప్రక్రియ ప్రారంభిస్తాం. ప్రజలు కూడా సహకరించాలి. ప్రజారోగ్య విభాగం ఇచ్చే సూచనలు పాటించి వ్యాధులు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు పాటించాలి.

– భావన, కమిషనర్, నగరపాలక సంస్థ

పౌష్టికాహారం పంపిణీ



నిత్యావసర సరకులు అందజేస్తున్న సంస్థ సభ్యులు

కాకినాడ రూరల్: రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ కార్యాలయంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం కిట్లను మీ కోసం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వైద్యుడు అద్దాల సత్యనారాయణ మాట్లాడుతూ సేవా కార్యక్రమాల ద్వారా వృద్ధులు, వ్యాధిగస్తులకు అండగా నిలుస్తున్న మీ కోసం సంస్థ సేవలు అభినందనీయమన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు పిల్లి నాగేశ్వరరావు, సభ్యులు వెంకటరమణ, బాబీ, షణ్ముఖేశ్వరరావు, శిరిధర్, అడబాల ట్రస్ట్ చైర్మన్ రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రచయిత గౌరీనాయుడికి సత్కారం

పిఠాపురం: పట్టణానికి చెందిన యువ సాహితీవేత్త, రచయిత, డాక్టర్ కిలారి గౌరీనాయుడును శనివారం విశాఖపట్నంలో ఘనంగా సత్కరించారు. విశాఖపట్నంలోని ఎస్‌వీవీపీవీఎంసీ డిగ్రీ కళాశాలలో సంస్కృత భారతి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంస్కృత భాష అధ్యయనం, ప్రాముఖ్యత అనే అంశంపై ప్రసంగించారు. సంస్కృతం నేర్చుకోవడానికి, మాట్లాడడానికి అవసరమైన మెళకువలను విద్యార్థులకు వివరించారు. సంస్కృతం నేర్చుకోవడం వల్ల అనువాద రంగం, విద్యా రంగంలో ఉండే ఉపాధి అవకాశాలను తెలియజేశారు.

షాపులపైకి దూసుకెళ్లిన మినీవ్యాన్



కరపలో విద్యుత్ స్తంభాన్ని, దుకాణాలను ఢీకొని దెబ్బతిన్న మినీవ్యాన్

డ్రైవర్, క్లినర్‌కు తప్పిన ప్రాణాపాయం

కరప: నిద్రమత్తులో వ్యాన్ నడపడంతో షాపులపైకి మినీవ్యాన్ దూసుకుపోయింది. విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో వ్యాన్ ముందుభాగం నుజ్జు, నుజ్జు అయింది. వ్యాన్ యజమాని, డ్రైవర్ ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. అర్ధరాత్రి కావడంతో ఘోర ప్రమాదం తప్పిందని స్థానికులు అంటున్నారు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. అనంతపురం నుంచి కాకినాడకు టమాటా లోడ్‌తో వస్తున్న మినీవ్యాన్ రావులపాలెం వచ్చేసరికి డ్రైవర్ నిద్రవ స్తోందని చెప్పడంతో వ్యాన్ యజమాని శ్రీను డ్రైవింగ్ తీసుకున్నాడు. కరప మార్కెట్ సెంటర్ వచ్చేసరికి రెప్పపడడంతో ఎడమవైపు నుంచి కుడివైపునకు వేగంగా వెళ్లి దుకాణాల నుంచి దూసుకుపోయి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఆగింది. వేగంగా ఢీకొనడంతో వ్యాన్ ముందుభాగం పూర్తిగా ధ్వంసమైంది. డ్రైవింగ్ చేస్తున్న శ్రీను క్యాబిన్‌కు స్టీరింగ్‌కు మధ్యలో ఇరుక్కుపోవడంతో స్థానికులు స్పందించి పోలీసులతో కలిసి రెండు గంటల పాటు శ్రమించి శ్రీనును బయటకు తీశారు. ప్రతి శనివారం క్షతగాత్రులను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో కాకర్ల శ్రీనివాస్‌కు చెందిన టిఫిన్ బండి, గుత్తుల కృష్ణకు చెందిన పాన్‌షాపు, బేరి చంద్రశేఖర్ స్వీట్‌స్టాల్ గోడ, చిక్కాల వీరబాబుకు చెందిన పూల దుకాణం ధ్వంసమయ్యాయి. విద్యుత్‌శాఖ ఏఈ సానా ఈశ్వరప్రసాద్, సిబ్బందితో కలిసి విద్యుత్ సరఫరాను నిలిపివేసి యుద్ధప్రాతిపదిక ధ్వంసమైన స్తంభం స్థానంలో కొత్తది వేశారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కరప ఎస్‌ఐ టి.రామకృష్ణ కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.



వ్యాన్ క్యాబిన్‌లో చిక్కుకుపోయిన యజమానిని బయటకు తీస్తున్న స్థానికులు

‘సిటిజన్’ ఖాతాదారులకు మెరుగైన సేవలు

బోట్‌క్లబ్: ది సిటిజన్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ కాకినాడ బ్రాంచి ప్రారంభించి 20 వసంతాలు పూర్తయిన సందర్భంగా స్థానిక సూర్యకళామందిరంలో శనివారం సభ్యుల సమావేశం జరిగింది. తొలుత సొసైటీ చైర్మన్ పీఆర్‌వీపీఎస్ రాజు, సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ కె.వి.సుబ్బయ్య ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఎండీ సుబ్బయ్య మాట్లాడుతూ కాకినాడ బ్రాంచి ప్రారంభించి రెండు దశాబ్దాలు కావస్తోందని, మంచి సేవలందించి ఖాతాదారుల ఆదరణ పొందిందన్నారు. సొసైటీ డైరెక్టర్ జె.సత్యనారాయణ పర్యవేక్షణలో అభివృద్ధి చెందిందన్నారు. కాకినాడ బ్రాంచి 160 కోట్ల వ్యాపారంతో దిగ్విజయంగా నడుస్తోందని, త్వరలో ఈ బ్రాంచిని పూర్తిస్థాయిలో బ్యాంకుగా మారుతుందని సుబ్బయ్య ప్రకటించారు. సొసైటీ చైర్మన్ రాజు మాట్లాడుతూ సొసైటీ 27 సంవత్సరాలు పూర్తి చేసుకుందని 42 శాఖలతో 6 రాష్ట్రాలలో విస్తరించి ఉందని, రూ.4200 కోట్ల వ్యాపారంతో అభివృద్ధి మార్గంలో నడుస్తోందని తెలిపారు. సొసైటీ డైరెక్టర్ కాకినాడ బ్రాంచి పర్యవేక్షకులు జె.సత్యనారాయణ మాట్లాడుతూ కాకినాడ బ్రాంచిలో 5 వేల మంది సభ్యులున్నారని, ఖాతాదారులు ఇస్తున్న ప్రోత్సాహంతో త్వరలో పూర్తిస్థాయి బ్యాంకుగా, మరింత అభివృద్ధి సాధిస్తామన్నారు. ఈ సమావేశంలో బ్యాంకు మేనేజర్ కె.లోపరాజు బ్యాంకు రిటైర్డు అధికారులు కొత్త సూర్యనారాయణ, హెచ్ఎస్ శర్మ తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ది సిటిజన్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఎండీ సుబ్బయ్య

గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- కలెక్టర్ షణ్మోహన్ సగిలి
- అధికారులతో కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): గృహ నిర్మాణ పనులు వేగవంతం చేసేలా వారం వారం నిర్దేశించిన లక్ష్యాల సాధనకు అధికారులు ప్రత్యేక కృషి చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. శనివారం గృహ నిర్మాణ పనులు పురోగతి, ఉపాధి హామీ పని దినాల పెంపు, అర్జీల పరిష్కారం, ఇంటింటికి పల్స్ సర్వే తదితర అంశాలపై అన్ని మండల ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ షణ్మోహన్, కాకినాడ మున్సిపల్ కమిషనర్ భావన, హౌసింగ్, డీఆర్డీఏ, డ్వామా, పంచాయతీ, జిల్లా పరిషత్, ఏపీఈపీడీసీఎల్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. ఇందుకు వారం వారం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. ఇందుకు క్షేత్రస్థాయిలో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేసి గృహ నిర్మాణ పనులు ముందుకు సాగేలా చూడాలన్నారు. ప్రతి సోమవారం మండల స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీలకు సంబంధించి ఆర్థిక అంశాలు మినహా మిగిలిన అర్జీలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఉపాధి హామీ పనిదినాల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలకు సంబంధించి రెండు నెలలు లక్ష్యం నిర్దేశించుకుని అక్టోబర్ రెండు నాటికి జిల్లాలో అన్ని ప్రాంతాల్లో వినియోగంలోకి తీసుకురావాలన్నారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్ భావన, హౌసింగ్ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, సీపీవో త్రినాథ్, జెడ్పీ డిప్యూటీ సీఈవో ఎం.రామ్‌కుమార్, పంచాయతీరాజ్ ఎస్ఈ ఎం .మల్లికార్జునరావు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో భర్తీ కాని పోస్టులు



సామర్లకోట మున్సిపల్ కార్యాలయం

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో కీలకమైన పోస్టులు భర్తీ చేయకపోవడంతో ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఇంజినీరింగ్ శాఖలో ఏఈ, టౌన్ ప్లానింగ్ శాఖలో టీపీఎస్, రెవెన్యూ శాఖలో రెవెన్యూ అధికారి, పారిశుధ్యానికి సంబంధించి శానిటరీ ఇన్‌స్పెక్టరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇంజినీరింగ్ సెక్షన్‌లో డీఈ మహిళా ఉద్యోగి దివ్యాంగురాలు రావడంతో బయటకు రాలేని పరిస్థితి ఉందని, దాంతో ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న పనులు, లైటింగ్ సమస్యలు పర్యవేక్షణ చేసే వారు కనిపించడం లేదనే వాదనలు ఉన్నాయి. సుమారు మూడేళ్లగా శానిటరీ ఇన్‌స్పెక్టరు పోస్టు భర్తీ చేయకపోవడంతో ఇన్‌చార్జిలు మొక్కుబడిగా వ్యహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. రెవెన్యూ అధికారి లేకపోవడంతో ఇంటి పన్నులు, మున్సిపల్ షాపుల అద్దెల బకాయిలపై శ్రద్ధ చూపలేక పోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ నిత్యం పట్టణంలో పర్యటించి ఆక్రమణలు, నూతన భవనాల నిర్మాణంపై పర్యవేక్షణ చేసి ఇళ్ల నిర్మాణాలు చేసుకొనే వారికి అవగాహన కల్పించి ఇంటి ప్లాన్లు పెట్టుకొనేలా చూడాలి. మున్సిపాలిటీలో ముఖ్యమైన శాఖలకు చెందిన అధికారులు లేకపోవడంతో సమస్యలు తిష్ట వేస్తు న్నాయి. మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేస్తే సమస్యల పరిష్కారానికి అవకాశం ఉంటుందనే వాదనలు ఉన్నాయి.

ఐఎంసీ టెర్మినల్ సందర్శన

కాకినాడ రూరల్: వాకలపూడి ఏపీఐఐసీ ఇండస్ట్రీయల్ ఏరియాలో పెట్రోల్, డీజిల్ స్టోరేజ్ చేసే ఐఎంసీ లిమిటెడ్ సంస్థ టెర్మినల్‌ను కేంద్ర విపత్తుల నివారణ సంస్థ(ఎన్‌డీఆర్ఎఫ్) బృందం శనివారం సందర్శించింది. ఎన్‌డీఆర్ఎఫ్‌కు చెందిన మన్మోహన్ యాదవ్ నేతృత్వంలోని బృంద సభ్యులు టెర్మినల్‌ను సందర్శించి ప్రమాదాలు నివారణ, ఎదుర్కొవడానికి సన్నద్ధత, అందుకు గల ఎక్విప్‌మెంట్‌ను పరీక్షించారు. ప్రమాదాలు సంభవించినప్పుడు దానికి సంబంధించిన పరికరాలు వాడే విధానం, మెళకువలను ప్రత్యక్షంగా వినియోగించి చూపించారు. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు అత్యవసర పరిస్థితిలో ఆక్సిజన్ లోపం ఉన్న ప్రాంతాలలో స్వీయ నియంత్రణ, శ్వాస ఉపకరణం(ఎస్‌సీబీఏ)ను ఉపయోగించే విధానం సిబ్బందికి నేర్పించారు. అనంతరం సిబ్బందికి సీపీఆర్ విధానం గురించి అవగాహన కల్పించడంతో పాటు ప్రమాదవశాత్తూ గొంతులో ఏదైనా వస్తువు, పదార్థం అడ్డుపడితే చేయాల్సిన ప్రథమ చికిత్స విధానాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో ఐఎంసీ సంస్థ మేనేజరు ఏబీశంకర్ జి.డిప్యూటీ మేనేజరు శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



పారిశ్రామికవాడలో టెర్మినల్‌ను పరిశీలిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందం

విద్యార్థులకు క్రీడా పరికరాల అందజేత

కాకినాడ రూరల్: సూర్యారావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు సౌమ్యశ్రీ, దేవి కోకో క్రీడలో రాణిస్తుండడంతో కోరమాండల్ మహిళా క్లబ్ ఆధ్వర్యంలో శనివారం వారికి క్రీడా పరికరాలను అందజేశారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కోరమాండల్ సంస్థ యూనిట్ హెడ్ సీహెచ్.శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్ని రాష్ట్ర స్థాయిలో కోకోలో రాణిస్తున్న విద్యార్థులను అభినందించారు. వారిని ప్రోత్సహించేలా క్రీడా పరికరాలు తమ సంస్థ మహిళా క్లబ్ సభ్యులు అందించడం శుభ పరిణామన్నారు. కార్యక్రమంలో కోరమాండల్ మహిళా క్లబ్ అధ్యక్షురాలు సీహెచ్ వెంకట దుర్గావతి, కార్యదర్శి మల్లీశ్వరి, కోశాధికారి శ్రీదేవి, సభ్యులు సృజన, మోహినికుమారి తదితరులు పాల్గొన్నారు.



క్రీడా పరికరాలు అందజేస్తున్న శ్రీనివాసరావు

దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంకండి

- తిమ్మాపురంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టిన ఎస్సై

కాకినాడ రూరల్: కాకినాడ, పరిసర ప్రాంతాలలో దొంగతనాలు జరుగుతుండడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలతో రాత్రి వేళల్లో గస్తీ పెంచారు. తిమ్మాపురంలో ఆటోతో ఎస్సై రవీంద్రబాబు, సిబ్బంది పలు వీధులు, కూడళ్లలో పర్యటించి దొంగతనాలపై గ్రామస్తులను అప్రమత్తం చేశారు. పెళ్లిళ్ల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు తాళాలు వేసినట్టు బయటకు కనిపించకుండా జాగ్రత్త పడాలని, విలువైన బంగారు ఆభరణాలను బ్యాంక్ లాకర్లలో ఉంచుకోవాలన్నారు, ఎవరైనా ఊర్లు వెళితే తమకు సమాచారం ఇస్తే లాక్డ్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా పర్యవేక్షించేందుకు సీసీ కెమేరాలు ఏర్పాటు చేస్తామన్నారు.



తిమ్మాపురంలో దొంగతనాలపై గ్రామస్తులను అప్రమత్తం చేస్తున్న ఎస్సై రవీంద్రబాబు

యువసేన సతీష్‌కు డాక్టరేట్




డాక్టరేట్ అందుకుంటున్న బొల్లం సతీష్

కాకినాడ క్రైమ్: స్థానిక యువసేన స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు బొల్లం సతీష్‌ను డాక్టరేట్ వరించింది. ప్రపంచ ప్రసిద్ధ హార్వర్డ్ యూనివర్సిటీ ప్రఖ్యాత యూకే కేంబ్రిడ్జి స్కూక్ష అనుబంధ సెంట్ మదర్ థెరిస్సా యూనివర్సిటీ, బెంగళూరు ఈ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. బెంగళూరులోని రాజ్‌భవన్ రోడ్‌లో ఉన్న హోటల్ పరాగ్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో శనివారం రాత్రి సతీష్ ఈ డాక్టరేట్ అందుకున్నారు. సామాజిక సేవ విభాగంలో డాక్టరేట్ పొందారు. తన స్నేహితుడు మార్నే స్వామి మరణంతో సతీష్ 2013లో శ్రీ యువసేన స్వచ్ఛంద సేవా సంస్థను ప్రారంభించారు. ఎన్నో సేవా కర్యక్రమాలు చేశారు. రక్తదానాలు, కోవిడ్ సమయంలో బాధిత కుటుంబాలు అండగా నిలబడడం, కోవిడ్‌తో తండ్రులను కోల్పోయిన 64 మంది విద్యార్థుల బాధ్యతను తీసుకోవడం, అత్యవసర సమయంలో అందరికీ తోడుగా నిలవడం వంటి సేవలను స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా అందించారు.


నిందితులను కఠినంగా శిక్షించాలి

- కరప, వేళంగి పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది నిరసన ర్యాలీ



కరపలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న కరప, వేళంగి పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది


కరప: కోలకతా నిందితులను కఠినంగా శిక్షించి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ కరప, వేళంగి పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది డిమాండ్ చేశారు. పీహెచ్‌సీలలో వైద్య సేవలు నిలిపివేసి కరపలో శనివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. డ్యూటీలో ఉన్న మహిళా డాక్టర్‌ను అత్యంత కిరాతకంగా హత్యచేయడం దారుణమని ఖండించారు. నోసేఫ్టీ–నోడ్యూటీ, స్టాప్ వైలెన్స్ ఎగెనెస్ట్ ఉమెన్, నో ఎక్స్యూజ్ ఫర్ అబ్యూస్, సేవ్ ది సేవియర్స్, ప్రాణంపోసే చేతులను ప్రాణాల కోసం పోరాడ నీయకు అంటూ నినాదాలు చేస్తూ కరపలో ర్యాలీ నిర్వహించారు. కరప, వేళంగి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఆంజలిన్, డాక్టర్ ఎంకే సౌజన్య, డాక్టర్ ఇ.సింధూర, సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీఎస్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



అచ్చంపేట జంక్షన్ వద్ద మెడికవర్ సిబ్బంది ర్యాలీ

మెడికవర్ ఆస్పత్రి సిబ్బంది నిరసన

కాకినాడ రూరల్: అచ్చంపేట జంక్షన్ వద్ద మెడికవర్ ఆస్పత్రి సిబ్బంది శనివారం ఓపీ సేవలు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. కోల్‌కతాలో ట్రైనీ డాక్టరుపై అఘాయిత్యాన్ని నిరసిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు సమ్మెకు మద్దతుగా దేశవ్యాప్తంగా ఉన్న అన్ని మెడికవర్ ఆస్పత్రుల్లో ఓపీ సేవలు బహిష్కరించినట్టు సెంటర్ హెడ్ సుభాకర్‌రావు తెలిపారు. ఆస్పత్రి సిబ్బందితో కలిసిన ఆయన నిరసన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో డాక్టరు మాతా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న వైద్య విద్యార్థులు, డీఎంహెచ్‌వో, తదితరులు

కొనసాగిన నిరసన

కాకినాడ క్రైం: కోల్‌కతా వైద్యురాలిపై జరిగిన అత్యాచార, హత్య ఘటనకు నిరసనగా కాకినాడ జీజీహెచ్‌లో జూనియర్ డాక్టర్లు విధులను బహిష్కరించారు. జీజీహెచ్ నుంచి ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ వరకు వెళ్లి కలెక్టరేట్‌కు వినత పత్రం అందజేశారు. కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వివిధ వైద్య సంఘాలతో పాటు డీఎంహెచ్‌ఓ సహా పలువురు అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఐఎంఏ బృదం జిల్లా అదనపు ఎస్పీ భాస్కరరావు కలిసి వినతపత్రం సమర్పించారు.

కాంట్రాక్టు సిబ్బందిని పర్మినెంట్ చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు

సామర్లకోట: మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని ఉమ్మడి జిల్లా ఎఐటీయుసీ ఉపాధ్యక్షుడు తాటిపాక మధు అన్నారు. స్థానిక విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘ భవనంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పనిని బట్టి వేతనం ఇవ్వాలని, కాంట్రాక్టు కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని ఆరోపించారు. ఖాళీ అయిన పోస్టులను భర్తీ చేయాలన్నారు. కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పెదిరెడ్ల సత్యనారాయణ, లక్ష్మి, దశయ్య, పెద్ద శ్రీను, కె.కిశోర్ తదితరులు పాల్గొన్నారు.